క్లుప్తంగా

వీఏఏకు సన్మానం



సీతారామపురం: అయ్యవారిపల్లిలోని రైతు సేవా కేంద్రంలో వీఏఏగా విధులు నిర్వహిస్తూ కొండాపురం మండలం సాయిపేటకు బదిలీ అయిన నరేంద్రను పలువురు ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన ఐదేళ్ల కాలంలో రైతులకు అందించిన సేవలను కొనియాడారు. పోలంగారిపల్లి సర్పంచ్ ముత్తూరు వెంకటసుబ్బయ్య, దేవిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ రేనాటి సుధాకర్, ఏహెచ్ఏ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏఓగా రాజశేఖర్



వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ ఏఓగా జిలకర రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొండాపురం మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో విద్యార్థి సత్తా



కలిగిరి: మండలంలోని బొమ్మరాజుచెరువులోని ఈస్ట్‌వుడ్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థి ఏ వెంకట హర్ష రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటాడని ప్రిన్సిపల్ యామినీదేవి తెలిపారు. నరసారావుపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పెంటాథ్లాన్ లేజర్ రన్ చాంపియన్‌షిప్ పోటీల్లో వెంకట హర్ష తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకున్నాడని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో వెంకటహర్షతో బుధవారం కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. పీఈటీ హుసేన్‌కు కూడా అభినందనలు తెలిపారు.

బీఎల్వోలకు శిక్షణ



సీతారామపురం : స్థానిక స్త్రీశక్తి భవనంలో బీఎల్వోలకు శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ సలీం మాట్లాడుతూ తప్పులు లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ, ఫారం-6,7,8, మార్పులు, చేర్పులు, తదితరాలపై అవగాహన కల్పించారు . అనంతరం డీటీ సందానీ మాట్లాడుతూ చనిపోయిన వారితో పాటు శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను క్షుణ్ణంగా పరిశీలించి తొలగించాలన్నారు. 1,200 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి విభజించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరిని గుర్తించి ఓటుహక్కు కల్పించాలన్నారు. అనంతరం బీఎల్వోలకు పరీక్ష నిర్వహించారు. ఆర్ఐ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

లంపి స్కిన్ వ్యాధికి ఉచితంగా టీకాలు

ఉదయగిరి రూరల్: గండిపాళెం పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ వరకు తెల్ల పశువులకు లంపి స్కిన్(ముద్దచర్మం) వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల వయస్సుపైబడిన ఆవులు, ఎద్దులకు టీకాలు వేస్తారని చెప్పారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతానికి గురై వృద్ధుడి మృతి

కావలి(జలదంకి): కావలి మండలం సిరిపురం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. కావలి రూరల్ పోలీసుల కథనం మేరకు.. సిరిపురం గ్రామానికి చెందిన పేపాల దర్గాబాబు (62) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఇద్దరు కుమార్తెలున్నారు. వారికి వివాహమైంది. ఇంట్లోకి వచ్చే విద్యుత్ సర్వీస్ వైరు దెబ్బతిని రేకులకు తగిలి ఉంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో దుర్గాబాబు స్నానం చేసి తడి డ్రాయర్‌ను రేకుల కమ్ములకు కట్టి ఉన్న తీగపై వేస్తున్నాడు. ఈ క్రమంలో చేతులు రేకులకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతను అక్కడికక్కడే మృతిచెందాడు. కావలి రూరల్ ఎస్సై బాజీబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

సీతారామపురం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సోంపల్లికు చెందిన సురేష్ కుటుంబానికి జనసేన నాయకుడు కొట్టే వెంకటేశ్వర్లు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఆయన వెంట జనసేన నాయకులు ఉన్నారు.

విధులకు రారు..
వచ్చినా నాడి పట్టరు

- ఇష్టారాజ్యంగా విధులకు హాజరు
- ఆస్పత్రికి వచ్చినా గంట కంటే ఉండరు
- 104 వాహన సేవలకు సైతం డుమ్మా
- కలిగిరి పీహెచ్‌సీ డాక్టర్ సునీల్‌కుమార్ తీరుపై సర్వత్రా విమర్శలు

కలిగిరి: కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సునీల్‌కుమార్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆయన విధులకు సక్రమంగా హాజరు కారు. పీహెచ్‌సీకి వచ్చినా గంట కంటే ఎక్కువ సమయం రోగులకు అందుబాటులో ఉండరు. ఆస్పత్రిలో ఉన్న కొద్ది సమయంలో కూడా రోగుల నాడి పట్టడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. 104 వాహనంతో గ్రామాల్లోకి వెళ్లి వైద్య సేవలు అందించాల్సి ఉన్నా డుమ్మా కొడుతున్నారు. వైద్యాధికారి తీరుతో అటు రోగులతో పాటు వైద్య సిబ్బంది కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉంది. అందుకోసం ఇద్దరు వైద్యులను నియమించారు. వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి కలిగిరిలో నివాసం ఉంటుండగా, మరో వైద్యాధికారి సునీల్‌కుమార్ నెల్లూరు నుంచి వస్తారు. ఒకరు 104 వాహనంలో గ్రామాలకు వెళితే, మరొకరు పీహెచ్‌సీలో రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలి. కలిగిరి పీహెచ్‌సీకి నిత్యం 60 నుంచి 80 మంది వరకు రోగులు వస్తుంటారు. డాక్టర్ సునీల్‌కుమార్ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదు. వచ్చినా గంటలోపే వెళ్లిపోతున్నారు. దీంతో వైద్యసిబ్బందే రోగులను పరీక్షించి మందులు ఇచ్చి పంపుతున్నారు. 104 వాహనంతో కూడా గ్రామాలకు వెళ్లి వైద్యం అందిస్తున్న దాఖలాలు లేవు. 104 వాహన సిబ్బందే రోగులకు మందులు అందజేస్తున్నారు.

ఖాళీ కుర్చీలు దర్శనం

కలిగిరి పీహెచ్‌సీకి మంగళవారం వైద్యం కోసం వెళ్లిన రోగులకు వైద్యుల గదిలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వైద్యాధికారిణి గీతారెడ్డి 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందించేందుకు సిద్దనకొండూరు వెళ్లారు. పీహెచ్‌సీలో ఉండాల్సిన వైద్యాధికారి సునీల్‌కుమార్ డుమ్మా కొట్టారు. దీంతో స్టాఫ్‌నర్స్, ఇతర సిబ్బందే రోగులను పరీక్షించి మందులు అందజేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాప్రతినిధులు హెచ్చరించినా..

ప్రతి మూడు నెలలకు జరిగే మండల సాధారణ సర్వసభ్య సమావేశాల్లో వైద్యాధికారి తీరుపై చర్చ నడుస్తోంది. ఎంపీపీ మెట్టుకూరు శిరీషాతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తీరును మార్చుకోవాలని వైద్యాధికారికి సూచించినా మారలేదు. దీంతో ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు వైద్యాధికారిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. రోగులకు వైద్యుడు అందుబాటులో ఉండడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ





రోగులకు మాత్రలు రాసిస్తున్న వైద్యసిబ్బంది

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

విధి నిర్వహణలో అలసత్వం వహించే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవు. పీహెచ్‌సీలో ఉండే ఇద్దరు వైద్యుల్లో ఒకరు 104 వాహనంతో వెళితే, మరొకరు వైద్యశాలలో ఉండి రోగులకు సేవలందించాలి. విధులకు హాజరుకాని వైద్యుడి విషయంలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం.

–వీ సుజాత, డీఎంహెచ్ఓ, నెల్లూరు

నీళ్లిచ్చి యూరియా ఇవ్వకపోతే ఎలా?

సోమశిల: అనంతసాగరం సొసైటీ ఎదుట యూరియా కోసం రైతులు బుధవారం ఆందోళన చేపట్టారు. దాదాపు 200 మంది రైతులు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో మండల వ్యవసాయాధికారులు హుటాహుటిన సొసైటీ వద్దకు చేరుకుని యూరియాను పంపిణీ చేశారు. సొసైటీ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులకు సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ రెండో పంటకు నీళ్లిచ్చి యూరియా ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. యూరియా అవసరాల మేరకు అందకపోవడంతో రైతులు నానాపాట్లు పడుతున్నారన్నారు. రైతులు మూడ్రోజులుగా ఆటోలు బాడుగకు తీసుకుని సొసైటీ వద్దకు వచ్చి పడిగాపులు పడుతున్నారన్నారు. సొసైటీ సిబ్బంది పలుకుబడి కలిగిన పెద్ద రైతులకు యూరియా ఇస్తూ, చిన్న, సన్నకారు రైతులను తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. రైతులను చూసి సొసైటీ సిబ్బంది తాళం వేసుకుని వెళ్లడంతో వారు ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. సొసైటీకి ఎన్ని లారీల యూరియా వచ్చింది..ఎంత మందికి ఇస్తున్నారో సొసైటీ ఎదుట స్టాక్ బోర్డు పెట్టాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత అన్వర్‌బాషా

వరి సాగులో నీటి యాజమాన్యం కీలకం



సోమశిల: నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శైలజాకుమారి

సోమశిల: వరి పంట సాగులో నీటి యాజమాన్యం కీలకమని చేజర్ల ఏఓ హిమబిందు తెలిపారు. చేజర్ల మండలం మడపల్లి, కోటితీర్థం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడగారు సాగులో నీటి యాజమాన్య, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం వరి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెగుళ్లను గుర్తించి నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఏఈఓ సుజాత, వీఏఏలు చెంచయ్య, హుసేన్ , రైతులు పాల్గొన్నారు.

పంట బీమాపై అవగాహన

సోమశిల: అనంతసాగరం మండలం వరికుంటపాడు, పాతాళపల్లి గ్రామంలో ఏఓ శైలజాకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం భూసార పరీక్ష కేంద్రం నిపుణులు నానో డీఏపీ ప్రయోజనాలు, పొలంలో స్ప్రే చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా చూపించారు. వ్యవసాయ విస్తరణాధికారిణి కృష్ణవేణి, వీఏఏలు జ్యోత్స్న, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



చేజర్లలో అవగాహన కల్పిస్తున్న ఏఓ హిమబిందు

వింజమూరు ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. వార్డు సభ్యులందరూ గున్నం సుశీలకు మద్దతు తెలపడంతో ఆమె ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల అధికారి తిరుమలయ్య ప్రకటించారు. గత పంచాయతీ ఎన్నికల సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు నాలుగేళ్లు మిడిదాల జయలక్ష్మి ఉపసర్పంచ్‌గా ఉన్నారు. ఆమె రాజీనామా చేయగా గున్నం సుశీలను ఉపసర్పంచ్ పదవి వరించింది. నూతన ఉపసర్పంచ్‌గా ఎన్నికైనా సుశీలను పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి, ఈఓ కే రామారావు, సర్పంచ్ నల్లాండ్ల సృజన, తదితరులు పాల్గొన్నారు.



నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖాన్ బుధవారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

సీతారామపురం : పక్కాగృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని దేవరాజు సూరాయపల్లె, సీతారామపురం-2 లేఅవుట్లలో గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు.గృహ నిర్మాణదారులకు సూచనలు చేశారు. గృహ నిర్మాణాల పనులను వేగవంతం చేసి నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. నీటి సమస్యతో ముందుకు సాగని గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజాప్రతినిధుల సహకారంతో నీటి వసతి కల్పించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. డీఈ పీరాన్, ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నరాయుడు ఉన్నారు.



పక్కాగృహాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వేణుగోపాల్

కిలో పొగాకు సగటు ధర రూ.206

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.207 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు వేలానికి 606 బేళ్లను తీసుకురాగా, 436 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 170 బేళ్లను తిరస్కరించినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ. 160, సగటున రూ.206.97 ధర పలికిందని వివరించారు. వేలంలో 19 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై ఆడిట్



సీతారామపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల ఆర్థిక లావాదేవీలపై బుధవారం ఆడిట్ నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆడిట్ బృంద సభ్యులు మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పొదుపు సంఘాలు జరిపిన ఆర్థిక లావాదేవీలను తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

1,2 తేదీల్లో ఆత్మకూరులో మెగా జాబ్ మేళా

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

మర్రిపాడు: ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని నిరుద్యోగ యువత కోసం ఆగస్టు 1,2 తేదీల్లో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మర్రిపాడు మండలంలో సుమారు రూ.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తొలుత మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఆర్ఐ కొత్రపాటి ప్రియా దంపతుల ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలయ సహకారంతో ఏర్పాటు చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన 32 మంది బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.30 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సుమారు 30 కంపెనీలు జాబ్‌మేళాకు హాజరయ్యేందుకు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మరో 20 కంపెనీలు రానున్నాయని స్పష్టం చేశారు. సుమారు 1400 మందికి ఉద్యోగావకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి ఆనం, పక్కన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల

ఆత్మకూరులో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల

విక్రమ సింహపురి వర్సిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో ఆరు కోర్సులతో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆనం తెలిపారు. ఇందుకోసం ఆత్మకూరు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్డీఓ ద్వారా గుర్తించామని చెప్పారు. ఒక్కో కోర్సుకు 60 చొప్పున ఆరు కోర్సులకు 300 సీట్లు మంజూరైనట్లు చెప్పారు. అన్ని అనుమతులు వస్తే ఈ ఏడాది నుంచే నెల్లూరులోని వీఆర్‌ఐపీఎస్‌లో తాత్కాలికంగా తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్డీఓ పావని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, సీడాప్ అధికారి హైమావతి, తహసీల్దార్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



కలిగిరి: స్థానిక ఎరువుల దుకాణాల్లో సెంట్రల్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్లులు, ఓ-ఫారాలను పరిశీలించారు. అనంతరం గోదాముల్లోని ఎరువుల నిల్వలను పరిశీలించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎన్ రాఘవరావు, వినుకొండ ఏడీఏ సీహెచ్ రవికుమార్, డీఏఓ కార్యాలయం ఏడీఏ నర్సోజీరావు, వింజమూరు ఏడీఏ శేషగిరిరావు, ఏఓ షేక్ జహీర్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిళ్లు ఢీ-ఇద్దరికి తీవ్రగాయాలు



దుత్తలూరు: రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పాపంపల్లి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు..జీ చెరువుపల్లెకి చెందిన పెంచలయ్య మోటార్‌సైకిల్‌పై ఉదయగిరి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. అలాగే దాసరపల్లి గ్రామానికి చెందిన అర్షద్ నందిపాడు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో పాపంపల్లె సమీపంలో రెండు బైక్‌లు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొనడంతో అర్షద్ తలకు తీవ్ర గాయం కాగా, పెంచలయ్యకు కాలుచేయి విరగడంతో పాటు శరీరంపైన తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించగా క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

నేడు, రేపు పారిశుధ్య పక్షోత్సవాలు

జలదంకి: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలో గురు, శుక్రవారాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. పీ-4 సర్వేలో గుర్తించిన బంగారు కటుంబాల ధ్రువీకరణ, జ్వరాలు వ్యాప్తి చెందే ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, ఆగస్టు 15 అవార్డులకు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

నిరుద్యోగులు పేర్లు నమోదు చేసుకోవాలి

సీతారామపురం : ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 1,2 తేదీల్లో నిర్వహించే మెగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన మండలంలోని నిరుద్యోగులు రెండ్రోజుల్లోగా గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సందానీ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతారామపురం: స్థానిక అరుంధతీయవాడలో బుధవారం సాయంత్రం ఓ టిప్పర్‌కు విద్యుత్ వైర్లు తగిలాయి. డ్రైవర్ గమనించక ముందుకు లాక్కుని వెళ్లాడు. స్థానికులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో వెంటనే డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేయడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించిన టిప్పర్లు నిత్యం అరుంధతీయవాడ మీదుగా సీతారామపురంలోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగల వద్ద స్తంభాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రేపటి నుంచి గ్రామసభలు

సీతారామపురం : మండలంలోని ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు పీ-4 పునఃపరిశీలన గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అప్పాజీ బుధవారం తెలిపారు. గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను ఏర్పాటు చేసి గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో మ్యాపింగ్ చేయించేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.